బలగం BALAGAM TV

BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com

హైదరాబాద్ బుధవారం 04 జూన్ 2025 | www.balagamtv.com | పేజీలు 4


## ఎర్రగడ్డ మానసిక ఆస్పత్రిలో ఫుడ్ పాయిజన్..

### 70 మందికి అస్వస్థత... గుండెపోటుతో ఒకరు మృతి

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

ఎర్రగడ్డ మానసిక ఆస్పత్రిలో ఫుడ్ పాయిజన్‌తో 70 మంది రోగులు అస్వస్థతకు గురయ్యారు. అస్వస్థతకు గురైన రోగుల్లో ఒకరు గుండెపోటుతో మృతి చెందారు. పూర్తి వివరాల్లోకెళ్తే.. మానసిక వైద్యశాలలో చికిత్స పొందుతున్న రోగులకు సోమవారం మామూలు ఆహారం అన్నం, అరటి పండ్లు, గుడ్లతో పాటు పరమాన్నాన్ని కూడా వడ్డించారు. సాయంత్రానికి డీసీ, కోర్టు వార్డుల్లోని కొంత మందికి స్వల్ప వాంతులు, విరోచనాలు మొదలయ్యాయి. వైద్యులు చికిత్సనందించినా కూడా డీసీ వార్డులో చికిత్స పొందుతున్న కరణ్(35) అనే వ్యక్తి గుండెపోటుతో మంగళవారం ఉదయం చనిపోయాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. ఇక అస్వస్థతకు గురైన రోగుల్లో ఇద్దరు తీవ్రమైన అస్వస్థతకు గురికావడంతో వెంటనే వారిని ఉస్మానియా జనరల్ ఆస్పత్రికి తరలించి మెరుగైన వైద్యం అందిస్తున్నారు. మిగతా రోగులకు ఉస్మానియా వైద్యులు ఎర్రగడ్డ మానసిక వైద్యశాలలోనే చికిత్సనందిస్తుండటం గమనార్హం. మరోవైపు ఫుడ్ పాయిజన్ ఎలా జరిగిందన్న కోణంలో అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. రోగుల మల నమూనాలను ఉస్మానియా దవాఖాన మైక్రో బయాలజీ విభాగానికి, నీటి నమూనాలను నారాయణ గూడలోని ఐపీఎంకు పంపించారు. జరిగిన సంఘటన గురించి డాక్టర్ అనిత వివరణ కోరగా..అస్వస్థతకు గురైన మాట వాస్తవమని. ఐపీఎం, ఉస్మానియా ల నుంచి రిపోర్టులు వచ్చిన తర్వాత అసలు విషయం తెలుస్తుందని ఆమె పేర్కొన్నారు.



## ఈ సాలా కప్ ఆర్‌సీబీదే

- ఐపీఎల్ విజేత ఆర్సీబీ
- ఫైనల్‌లో పంజాబ్ సూపర్ కింగ్స్‌పై గెలుపు
- 18 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత ఆర్సీబీ తొలి ఐపీఎల్ టైటిల్ కైవసం
- మరో సారి పంజాబ్‌క నిరాశే

వివరాలు 4వ పేజీలో



# ముందస్తు చర్యలు చేపట్టాలి

- వర్షాలు, వరదలు తలెత్తినప్పుడు ఒక వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలి
- 24గంటలూ అందుబాటులో ఉండాలి
- అధికారులకు సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశం



బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

ప్రస్తుత సీజన్‌ను దృష్టిలో పెట్టుకుని హైదరాబాద్ నగరంలో వర్షాలు, వరదల వంటి పరిస్థితులు తలెత్తినప్పుడు కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి పర్యవేక్షించడానికి వీలుగా ఒక వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు అధికారులను ఆదేశించారు. వర్షాలు పడినప్పుడు నగరంలో ట్రాఫిక్‌తో పాటు ఇతర సమస్యలు తలెత్తకుండా పోలీసు, ట్రాఫిక్, హైడ్రా, జీహెచ్ఎంసీ విభాగాలు సమన్వయంతో పనిచేయాలని చెప్పారు.వర్షాకాల సన్నద్ధతపై ముఖ్యమంత్రి ఉన్నతాధికారుల సమావేశంలో పరిస్థితిని సమీక్షించారు. అవసరానికి అనుగుణంగా 24 గంటల పాటు ఎమర్జెన్సీ టీమ్స్ అందుబాటులో ఉండాలని చెప్పారు. జంట నగరాల్లో గుర్తించిన 141 వాటర్ లాగింగ్ పాయింట్స్ వద్ద వాటర్ హార్వెస్టింగ్ వెల్స్ పనులకు సంబంధించిన పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు.

వాతావరణ శాఖ సూచనలకు అనుగుణంగా ఎప్పటికప్పుడు ముందస్తు చర్యలు చేపట్టాలని చెప్పారు. అసంపూర్తిగా ఉన్న నాలాల పూడికతీత పనులు వీలైనంతగా త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి ముందస్తు చర్యలు తీసుకునేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సూచించారు. ఔటర్ రింగ్ రోడ్డు లోపల కోర్ అర్బన్ రీజియన్‌లో సమస్యలు తలెత్తకుండా ప్రత్యేక దృష్టి పెట్టాలని అన్నారు. ఈ ప్రాంతంలోని చెరువులు, నాలాలు, రోడ్ల విస్తరణ, అభివృద్ధికి సంబంధించిన ప్రత్యేక పాలసీని తయారు చేసే అంశాన్ని పరిశీలించాలని అధికారులకు చెప్పారు. డీసిల్టింగ్ పనులను వేగవంతం చేయాలన్నారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు గారితో పాటు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## భారత్‌లో కంపెనీలు పెట్టండి



- మనదేశంలో అపార అవకాశాలు ఉన్నాయి
- కేసీఆర్ జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకుని లక్ష్యాలను అందుకోవాలి
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- యూనివర్సిటీ ఆఫ్ టెక్సాస్ - డల్లాస్ యూనివర్సిటీ విద్యార్థులతో సమావేశం

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

అమెరికాలో వివిధ కారణాలతో ఇబ్బందులు పడే భారతీయ విద్యార్థులకు అండగా నిలబడతామన్నారు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్. ఎన్నో ఆశలతో ఉన్నత విద్య కోసం వచ్చిన విద్యార్థులు, అవగాహన లేక ఏమైనా తప్పు చేస్తే వారికి అవసరమైన న్యాయ సహాయం అందించేందుకు బీఆర్ఎస్ అమెరికా విభాగం తరపున ప్రయత్నం చేస్తామన్నారు. అమెరికా వచ్చిన విద్యార్థులు ఏదైనా కారణంతో తిరిగి వస్తే ఆ విద్యార్థితో పాటు వారి కుటుంబం ఎంతో ఆవేదనకు గురి అవుతుందన్నారు. అందుకే విద్యార్థులకు అండగా నిలబడేందుకు నిర్ణయం తీసుకున్నామన్నారు. అయితే విద్యార్థులు కూడా అమెరికా చట్టాలను అక్కడి సమాజంలో వస్తున్న మార్పులను అర్థం చేసుకొని మసులుకోవాలని సూచించారు. స్థానిక చట్టాలతో పాటు ఇక్కడి పరిస్థితులను ప్రతీ ఒక్క విద్యార్థి అవగాహన చేసుకోవాలన్నారు. అమెరికాలోని యూనివర్సిటీ ఆఫ్ టెక్సాస్, డల్లాస్ లో చదువుకుంటున్న విద్యార్థులతో కేటీఆర్ మాట్లాడారు. యూనివర్సిటీ విద్యార్థులు అడిగిన పలు ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చారు. అమెరికా పోవాలన్నా, చదువుకోవాలన్నా ఎన్నో వ్యయ, ప్రయాసలకు గురయ్యే వాళ్ళమన్న కేటీఆర్, ప్రపంచం వేగంగా మారిపోయి ఇప్పుడు అనేక సౌకర్యాలు అందుబాటులోకి వచ్చాయన్నారు. దాంతోపాటే అమెరికా విద్య కూడా అనేక మందికి అందుబాటులోకి వచ్చిందన్నారు.

కేవలం ర్యాంకుల కోసమో, గ్రేడ్ల కోసమో కాకుండా జీవితంలో సాధించాల్సిన ప్రధాన లక్ష్యాల పైన దృష్టి పెట్టాలన్నారు. చూస్తుండగానే మనిషి జీవితంలో 50 సంవత్సరాలు పూర్తి అవుతాయని ఇంత స్వల్ప కాలంలోనే తమ కలలు, ఆకాంక్షలను అందిపుచ్చుకోవాలన్నారు. లక్ష్యం వైపు సాగే క్రమంలో అవరోధాలు ఎదురైనా, మనతోనే ఉన్న వ్యక్తులు వెనక్కి లాగినా నిబద్ధతతో ముందుకు పోవాలన్నారు. కేవలం ఉద్యోగాల కోసం మాత్రమే కాకుండా సమాజంలో ప్రపంచంలో మంచి మార్పు తీసుకువచ్చే దిశగా ప్రయత్నం చేయాలన్నారు.

ప్రపంచవ్యాప్తంగా గొప్ప ఆవిష్కరణలు వస్తున్నాయన్న కేటీఆర్, ఇన్నోవేషన్ రంగంలో ప్రపంచ దేశాలతో ఇండియా పోటీపడి రాణించాల్సిన అవసరం ఉందన్నారు. అమెరికాలోని ఉన్నత విద్యా సంస్థల్లో చదువుతున్న భారతీయ విద్యార్థులు నూతన ఆవిష్కరణలపై దృష్టి సారించాలన్నారు.

రిస్క్ తీసుకున్నప్పుడు మాత్రమే

మిగితా 2వ పేజీలో



## స్థానికులకే 85 శాతం ఉద్యోగాలు

- లద్దాఖ్ రిజర్వేషన్లు, భాష, స్థానికతపై కేంద్రం కీలక నిర్ణయం
- లద్ధాఖ్ రిజర్వేషన్ (సవరణ) రెగ్యులరేషన్ 2025 విడుదల చేసిన కేంద్ర హెూం శాఖ

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

: కేంద్ర పాలిత ప్రాంతం లద్దాఖ్‌లో నివసిస్తున్న ప్రజల భాష, సంస్కృతి, రాజ్యాంగ పరిరక్షణ కోసం కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. వారి స్థానికత, రిజర్వేషన్ల అంశంపై కొత్త నిబంధనలతో అధికారిక ప్రకటన చేసింది. ఈ మేరకు లద్ధాఖ్ రిజర్వేషన్ (సవరణ) రెగ్యులరేషన్ 2025 విడుదల చేసింది కేంద్ర హెూం శాఖ. 85 శాతం ఉద్యోగాలను స్థానికులకే ఇవ్వాలని నిర్ణయించింది.15 ఏళ్లకు మించి ఆ ప్రాంతంలో నివసిస్తున్నవారు, కనీసం 7 ఏళ్లపాటు అక్కడ చదువుకొని 10 లేదా 12వ తరగతి పరీక్షలకు హాజరైనవారిని స్థానికులుగా గుర్తించాలని వెల్లడించింది. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల పిల్లలు, అఖిల భారత సర్వీస్ ఆఫీసర్లు, కేంద్ర ప్రభుత్వ అనుబంధ సంస్థలు, ప్రభుత్వ రంగ బ్యాంకుల అధికారులు, కేంద్ర ఆధీనంలో నడిచే విద్యాసంస్థల ఉద్యోగులు 10 ఏళ్ల పాటు నివసిస్తే లద్దాఖ్ స్థానికత లభిస్తుందని చెప్పింది. అంతేకాకుండా లద్దాఖ్ అటానమస్ హిల్ డెవలప్‌మెంట్ కౌన్సిల్‌లో మూడులో ఒక వంతు సీట్లు మహిళలకే కేటాయించనున్నట్లు స్పష్టం చేసింది. తక్షణమే ఈ ఉత్తర్వులు అమల్లోకి రానున్నట్లు ప్రకటించింది.

వీటితో పాటు లద్దాఖ్ అధికారిక భాష రెగ్యులేషన్ 2025ను మంగళవారం ప్రకటించింది కేంద్రం. స్థానిక లద్దాఖ్ భాషల పరిరక్షణే లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది. దీని ప్రకారం ఇంగ్లీష్, హిందీ, ఉర్దూ, భోటీ, పుర్గీని అధికారిక భాషలుగా గుర్తించింది. ప్రభుత్వ కార్యక్రమాల కోసం ఇంగ్లీష్ భాషను ఉపయోగించుకోవచ్చని చెప్పింది. స్థానిక భాషల పరిరక్షణ కోసం విద్యాసంస్థల్లో వీటిని వాడేలా చర్యలు తీసుకోవాలని సూచించింది. వీటితో పాటు మరిన్ని స్థానిక భాషలైన షినా (డార్డిక్), బ్రోక్స్కట్ (డార్డిక్), బాల్టీ, లద్ధాఖీని అభివృద్ధి చేయాలని చెప్పింది.

## భూ సమస్యలకు ఇక శాశ్వత పరిష్కారం



- మళ్లీ అసైన్డ్ కమిటీలు వేస్తాం :
- భూ భారతి సర్వే పైలట్ ప్రాజెక్టు ప్రారంభ సభలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

ప్రజా ప్రభుత్వంలో రాష్ట్రంలోని భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించనుందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. మధిర నియోజకవర్గం ఎర్రుపాలెం మండలం ములుగుమాడు గ్రామంలో భూ భారతి సర్వే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి, తుమ్మల నాగేశ్వర్ రావు, మరియు ఇతర ప్రజా ప్రతినిధులు అధికారులు హాజరయ్యారు.

ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ “భూభారతి దేశ చరిత్రలో అరుదైన చట్టం. రైతుల భూములకు సంపూర్ణంగా సరిహద్దులు గుర్తించి, భవిష్యత్తులో ఎటువంటి వివాదాలు లేకుండా భద్రత కల్పించడమే లక్ష్యం. బీఆర్ఎస్ ప్రభుత్వం తీసుకువచ్చిన ధరణి రైతుల హక్కులను కాలరాశింది. ఒకవైపు తమకు కావాల్సిన వారికే భూములు కట్టబెట్టి, తిరిగి సవరణకు అవకాశం లేకుండా చేసింది. పది ఎకరాల భూమి ఉన్న రైతుకు 17 ఎకరాల పాస్ బుక్ ఇచ్చిన ఉదాహరణలు ఎన్నో. కాంగ్రెస్ ప్రభుత్వం భూ సంస్కరణల చట్టం ద్వారా పేదలకు పంచిన 26 లక్షల ఎకరాలను బీఆర్ఎస్ ప్రభుత్వం ధరణి పార్ట్ బీలో పెట్టి, విచారణ లేకుండా పెద్ద ప్రజల హక్కులు లాక్కుంది. అర్హులైన వారికి తిరిగి భూమి పట్టాలు ఇచ్చి, వారి భూముల్లో వారిని కూర్చోబెడుతాం.

భూభారతి చట్టంతో భూమిలేని పేదలకు ఇళ్ల స్థలాలు, సాగు భూములు ఇస్తాం. ప్రతి సంవత్సరం రెవెన్యూ సదస్సులు, గ్రామ సభలు నిర్వహించి భూముల అమ్మకాలు, భూ రికార్డుల మార్పులపై ప్రజల సమక్షంలో చర్చించే విధానం అమలుకానుంది. ములుగుమాడు గ్రామం మొత్తం కదిలి వచ్చి ఈ ప్రాజెక్టును స్వాగతించిందంటే, ఈ చట్టం పట్ల ప్రజల్లో ఉన్న విశ్వాసం ఏ స్థాయిలో ఉందో అర్థమవుతుంది. భూభారతి చట్టం మన అందరిది. ప్రతి ఒక్కరూ అవగాహన చేసుకుని, పది మందికి వివరించాలి” అన్నారు.

**ఆగస్టు 15 నాటికి ధరణి నుంచి విముక్తి కల్పిస్తాం..**

మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ “ఈ రోజు నుంచి రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి రెవెన్యూ విలేజ్ లో అధికారులే మీ గ్రామానికే వచ్చి సర్వే చేస్తారు.ఇక మీదట ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ రైతులు తిరగనవసరంలేదు. ప్రతి రైతు భూమికి ఒక భూధార్ నెంబర్ ఇస్తాం. రాష్ట్రం లో 413 రెవెన్యూ గ్రామాలలో నక్షలు లేవు, అయిదు గ్రామాలను నక్షల కోసం సర్వే చేసేందుకు ఎంపిక చేసి పైలెట్ ప్రాజెక్ట్ చేస్తున్నాం. ములుగుమాడుకు కూడ ఒక్క నక్ష తయారు చేసి ఇస్తాం. ప్రతీ రెవెన్యూ విలేజ్ కి ఒక గ్రామపాలన అధికారిని నియమిస్తాం. 3,556 మంది నియామకం చేస్తున్నాం. ఇక ప్రభుత్వ రెవెన్యూ అధికారులు రైతులకు అండగా వారి భూములకు కాపలాదారుడుగా ఉంటారు. రాష్ట్ర వ్యాప్తంగా భూమి లేకున్నా ఉన్నట్లుగా చిత్రీకరించారు

ఆ నాటి ప్రభుత్వం నేతలు. రైతుబంధు కోసం పెద్దల సహకారంతో అక్ర మాలు చేశారు. ఆనాడు ఇందిరమ్మ పేరుతో పేదలకు ఇచ్చిన భూములను ధరణితో అక్రమంగా తారు మారు చేశారు. ఈ చట్టం పేదల చుట్టం మాదిరిగా పని చేస్తుంది. రిజిస్ట్రేషన్ వ్యవస్థ లో కూడా మార్పులు తీసుకువస్తున్నాం. స్లాట్ బుకింగ్ పెట్టి పారదర్శకంగా రిజిస్ట్రేషన్ ప్రకియ చేస్తున్నాం. రాష్ట్ర ప్రజలకు గత ప్రభుత్వం ఇచ్చిన

మిగితా 2వ పేజీలో

## ట్రంప్ బెదిరింపులకు మోడీ లొంగిపోయారు..




- కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ బెదిరింపులకు ప్రధాని నరేంద్రమోదీ లొంగిపోయారని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ అన్నారు. ఆపరేషన్ సింధూర్ ప్రారంభం కాగానే మోదీకి ట్రంప్ ఫోన్ చేశారని, ‘నరేందర్ సరెండర్’ అనగానే మోదీ ‘జీ హుజూర్’ అంటూ ఆపరేషన్‌ను నిలిపేశారని రాహుల్ ఆరోపించారు. సరెండర్ కావడం బీజేపీ ఆరెస్సెస్‌లకు అలవాటేనని విమర్శించారు. ట్రంప్ బెదిరింపులకు ప్రధాని మోదీ భయపడ్డారని, కానీ నాడు ఇందిరాగాంధీ ఎవరి బెదిరింపులకూ భయపడలేదని రాహుల్‌గాంధీ అన్నారు.

1971 ఇండో-పాక్ యుద్ధ సమయంలో అమెరికా బెదిరింపులను ఇందిరా గాంధీ లెక్క చేయకుండా, బంగ్లాదేశ్ ఆవిర్భావం జరిగేలా చేశారని రాహుల్ గాంధీ గుర్తుచేశారు. ఈ విధంగా కాంగ్రెస్ అగ్రరాజ్యం అమెరికాకు వ్యతిరేకంగా పోరాడిందని ఆయన అన్నారు. 1971 ఇండో-పాక్ యుద్ధ సమయంలో అమెరికా, భారత్‌ను బెదిరించింది. తరువాత అమెరికా తన ఏడవ నౌకాదళాన్ని, ఆయుధాలను, విమాన వాహక నౌకను పాక్‌కు సాయంగా పంపించింది. అయినా అప్పటి భారత ప్రధానమంత్రి ఇందిరా గాంధీ చలించలేదు. మేము ఏం కావాలంటే అదే చేస్తామని తేల్చి చెప్పింది. చివరికి 1971 యుద్ధం ద్వారా పాక్‌ను రెండుగా చీలేలా చేసింది’ అని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. బోఫాల్ లో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తల సమక్షంలో ‘సంఘటన్ సృజన్ అభియాన్’ ప్రారంభించిన రాహుల్, ఆ తరువాత ఎక్స్‌లో ఓ పోస్ట్ పెట్టారు.

## బనకచర్ల ప్రాజెక్టును వ్యతిరేకిస్తున్నాం



- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్మించ తలపెట్టిన బనకచర్ల ప్రాజెక్టు ను తాము వ్యతిరేకిస్తున్నట్లు, ఈ ప్రాజెక్టును ఎట్టి పరిస్థితుల్లోనూ ఒప్పుకోబోమని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిఅన్నారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ సముద్రంలో కలిసే నీళ్లే వాడుకుంటామని ఏపీ నేతలు ఎలా చెబుతారని ప్రశ్నించారు. బనకచర్లను అడ్డుకునేందుకు అన్ని ప్రయత్నాలు చేస్తున్నాం. గోదావరి రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు , కేంద్ర మంత్రి సి.ఆర్. పాటిల్ కు లేఖలు రాశాం. ఈ అంశంపై కేంద్ర మంత్రితో నేరుగా మాట్లాడాం. ప్రాజెక్టును అడ్డుకోవాలని కోరాం. మా అభ్యంతరాలను కేంద్రానికి తెలియజేశాం. ఈ అంశంపై సరైన సమయంలో స్పందిస్తాం అని తెలిపారు.



## మిస్ వరల్డ్ పోటీల ఖర్చు రూ.30 కోట్లే


- స్పాన్సర్ల ద్వారానే రూ.21 కోట్లు
- రూ.200 కోట్లు ఎక్కడయ్యాయో చెప్పాలి..?
- మంత్రి జూపల్లి కృష్ణారావు

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్‌లో జరిగిన మిస్ వరల్డ్ పోటీల నిర్వహణకు సుమారు రూ.30 కోట్ల ఖర్చు అయిందని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. దీనిలో స్పాన్సర్ల ద్వారానే రూ.21 కోట్లు వచ్చాయని, రాష్ట్ర ప్రభుత్వానికి అయిన ఖర్చు రూ.9 కోట్లు మాత్రమేనని స్పష్టం చేశారు. మరో 10 నుంచి 11 కోట్ల నిధులు మిగిలిన స్పాన్సర్ల నుంచి రావాల్సి ఉందని, ఇందుకు ఒప్పందాలు ఉన్నాయని అన్నారు. ఆ మొత్తం కూడా వస్తే రాష్ట్ర ప్రభుత్వాకి సున్నా ఖర్చు అవుతుందని చెప్పారు. ప్రభుత్వానికి పైసా ఖర్చు లేకుండా ప్రపంచం మొత్తాన్ని హైదరాబాద్ వచ్చేలా చేశామని వివరించారు. మిస్ వరల్డ్ పోటీల ద్వారా తెలంగాణ గొప్పతనాన్ని ప్రపంచానికి చాటి చెప్పామని అన్నారు. డా.బీఆర్.అంబేడ్కర్ సచివాలయంలో రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తో కలిసి మంత్రి జూపల్లి మంగళవారం మీడియాతో మాట్లాడారు. హైదరాబాద్ వేదికగా తెలంగాణ పర్యాటక ప్రమోషన్,సంస్కృతి సంప్రదాయాలు ప్రతిబింభించడమే లక్ష్యంగా నిర్వహించిన మిస్ వరల్డ్ 2025 పోటీలు విజయవంతం అయ్యాయని చెప్పారు.ఈ ఈవెంట్‌ను అపూర్వ విజయంగా నిలిపిన ప్రతి ఒక్కరికీ పేరుపేరునా మంత్రి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. పర్యాటకం, హస్తకళలు, చేనేత ఉత్పత్తులకు మంచి ప్రమోషన్ వచ్చిందని, మన సంస్కృతి, సంప్రదాయాలు, ఆహారపు అలవాట్లను ప్రపంచానికి పరిచయం చేశామని చెప్పారు. ఆ వేడుకల నిర్వహణ, ఆతిథ్యం పట్ల కంటెస్టెంట్లు, మిస్ వరల్డ్ సంస్థ ప్రతినిధులు, మీడియా ప్రతినిధులు సైతం ఆనందం వ్యక్తం చేశారని చెప్పారు. ఈ పోటీల నిర్వహణపై రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రతిపక్షాలు అభినందించాల్సి పోయి

## గుండెజబ్బుల ప్రమాదం పెంచుతున్న కరోనా..!

- అధ్యయనంలో శాస్త్రవేత్తల గుర్తింపు



బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

కరోనావైరస్ శరీరాన్ని ఎలా ప్రభావితం చేస్తుందో అర్థం చేసుకోవడానికి ప్రపంచవ్యాప్తంగా శాస్త్రవేత్తలు అనేక పరిశోధనలు నిర్వహించారు. ఇటీవలి ఓ అధ్యయనంలో కొవిడ్‌తో గుండె సంబంధిత సమస్యలతో మరణాలు వేగంగా పెరిగినట్లు శాస్త్రవేత్తలు గుర్తించారు. కొవిడ్ తర్వాత ప్రపంచవ్యాప్తంగా గుండెపోటు, కార్డియాకరెస్ట్ కేసులు పెరిగాయని పలు నివేదికలు వైరస్ వెలుగులోకి వచ్చాక గుండె సంబంధిత మరణాలు పెరిగినట్లు శాస్త్రవేత్తలు పేర్కొన్నారు. మసాచుసెట్స్‌లో మరణించిన దాదాపు 1.28లక్షల మంది మరణ ధ్రువీకరణపత్రాల డేటాను పరిశోధకుల బృందం విశ్లేషించి హెచ్చరికలు జారీ చేశారు. మహమ్మారి నుంచి 2020 నుంచి 2023 మధ్య గుండె సంబంధిత మరణాల రేటు గణనీయంగా ఎక్కువగా ఉందని శాస్త్రవేత్తలు గుర్తించారు. మసాచుసెట్స్ జనరల్ హాస్పిటల్‌లోని కార్డియాలజీ విభాగంలో ప్రొఫెసర్, రీసెర్చ్ డైరెక్టర్ జాసన్ హెచ్ వాస్ఫీ మాట్లాడుతూ కరోనా ఇన్ఫెక్షన్ గుండె ఆరోగ్యాన్ని ప్రభావితం చేసిందని గత అధ్యయనాలు స్పష్టం చేశాయన్నారు. వైరస్ ప్రారంభం నుంచి గుండెపోటు, కార్డియాకరెస్ట్‌తో ఎక్కువ మంది ప్రాణాలు కోల్పోతున్నట్లు గుర్తించామన్నారు. మయోకార్డియల్ ఇన్ఫారక్షన్‌తో ఆసుపత్రిలో చేరే వారి సంఖ్య 20-34శాతం తగ్గిందని ఆసుపత్రి డేటా చూపిస్తుందని, అయితే గుండెపోటు మరణాలు పెరిగాయని.. మహమ్మారి సమయంలో ఇతర ఆరోగ్య సేవల్లో లోపాన్ని హైలెట్ చేస్తుందని అధ్యయనాలు పేర్కొన్నాయి. అమెరికన్ హార్ట్ అసోసియేషన్ ఓ నివేదిక కోవిడ్-19 బాధిత వ్యక్తులు భవిష్యత్‌లో మూడేళ్ల తర్వాత ఎలాంటి లక్షణాలు కనిపించకపోయినా గుండెపోటు, స్ట్రోక్, అకాల మరణాలు సంభవించే ప్రమాదం రెండు రెట్లు ఎక్కువగా ఉంటుందని తెలిపింది. లాస్ ఏంజిల్స్‌లోని సదరన్ కాలిఫోర్నియా విశ్వవిద్యాలయంలో పబ్లిక్ హెల్త్ సైన్సెస్ ప్రొఫెసర్ డాక్టర్ హూమన్ అల్లే మాట్లాడుతూ.. పాజిటివ్ పరీక్షించినప్పటికీ తీవ్రమైన లక్షణాలు కనిపించని వారికి కూడా హృదయ సంబంధ సమస్యల ప్రమాదం రెండు రెట్లు ఎక్కువగా ఉందని పరిశోధనలో తేలింది. కరోనావైరస్ కొంతమంది వ్యక్తులకు దీర్ఘకాలిక నష్టాన్ని కలిగిస్తున్నట్లు కనిపిస్తోందని పరిశోధకులు పేర్కొన్నారు.

# మేడారం మహాజాతరకు శాశ్వత పనులు చేపట్టాలి

- భారీ వర్షాల వల్ల నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలి
- మంత్రి ధనసరి సీతక్క

**బలగం టీవి, హైదరాబాద్**

వచ్చే సంవత్సరం 2026లో జరగనున్న మేడారం మహాజాతరకు శాశ్వత పనులు చేపట్టాలని, జాతర విజయవంతం చేయడానికి అన్ని శాఖల అధికారులు సమన్వయంతో ముందస్తు ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని మంత్రి ధనసరి అనసూయ సీతక్క ఆదేశించారు. మంగళవారం ములుగు జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో రానున్న మేడారం మహా జాతరను, భారీ వర్షాలను పురస్కరించుకొని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్, ఎస్పీ శబరిష్, ఐటీడీఏ పీఓ చిత్ర మిశ్రా, డీఎఫ్ఓ రాహూల్ కిషన్ జాదవ్, జిల్లా అదనపు కలెక్టర్లు మహేందర్ జి, సంపత్ రావు, గ్రంథాలయ సంస్థ చైర్మెన్ రవి చందర్‌తో కలిసి జిల్లా అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. గతంలో జరిగిన మహా మేడారం జాతర సందర్భంగా పనిచేసిన జిల్లా అధికారులు నేటికీ అవే బాధ్యతలు నిర్వహిస్తున్నారని, వారి జాతర అనుభవాలను దృష్టిలో ఉంచుకొని సందర్శకులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సకాలంలో ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు. ఇప్పటికే




రూ.33కోట్లతో రోడ్డు నిర్మాణ పనులు జరుగుతున్నాయని, రానున్న రోజుల్లో జాతరలో శాశ్వత పనులను నాణ్యతతో పూర్తి చేయడానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను ఆదేశించారు. ముఖ్యంగా జాతర సమయంలో మేడారంలోని పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. పూర్తిస్థాయిలో మరుగుదొడ్లను ఏర్పాటు చేయడంతో పాటు నిరంతరం మంచినీటిని సరఫరా చేయాలని తెలిపారు. జిల్లా పోలీసు యంత్రాంగం ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భద్రతా ఏర్పాట్లు చేయాలన్నారు. క్యూ లైన్లు, వాటిపై షెడ్ ఏర్పాట్లు చేయాలని సూచించారు. రానున్న రోజుల్లో భారీ వర్షాలు పడే అవకాశం ఉన్నందున గ్రామాల్లోని కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని, కాలువల్లోని గుర్రపు డెక్కను తొలగించాలన్నారు. వరదలతో రహదారులు, వంతెనలు దెబ్బతి నకుండా ముందే తగిన జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. జిల్లా కేంద్రం నుంచి ఏటూరునాగారం వరకు ఉన్న జాతీయ రహదారికి ఇరువైపుల చెట్లను అటవీ శాఖ, ఆర్అండ్‌బీ సిబ్బంది పర్యవేక్షించి అందులో బలహీనమైన చెట్లను తొలగించాలని సూచించారు. జిల్లాలోని లోతట్టు గ్రామాలు, ప్రాంతాలపై ప్రత్యేక దష్టి సారించాలని అన్నారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని జిల్లాలోని కటాఫ్ గ్రామాలను గుర్తించి ప్రజలను అవసరం మేరకు సురక్షిత ప్రాంతాలకు తరలించేలా చర్యలు తీసుకోవాలన్నారు. 3 నెలలకు సరిపడా నిత్యవసర సరుకులు అందుబాటులో ఉంచాలని తెలిపారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని తెలిపారు. గోదావరి, జంపన్న వాగు వద్ద నీటి ప్రవాహాన్ని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ముందస్తు ఏర్పాట్లపై అందరినీ అప్రమత్తం చేయాలని తెలిపారు. రెస్క్యూ బృందాన్ని సిద్ధం చేయాలని, ఎవరూ చేపలు పట్టకుండా అవగాహన కల్పించాలని తెలిపారు. వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యం లో అవసరమైన వైద్య సేవలు అందించాలని చెప్పారు. ప్రతి శుక్రవారం డ్రైడే నిర్వహించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. భారీ వర్షాలను, మేడారం మహా జాతర జిల్లా యంత్రాంగం సవాల్‌గా స్వీకరించి అప్రమ త్తంగా ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ రవీందర్, ఆర్డీఓ వెంకటేష్, జిల్లా, మండల అధికారులు, మేడారం పూజారులు తదితరులు పాల్గొన్నారు.

# భూ సమస్యలకు ఇక శాశ్వత పరిష్కారం

(మొదటి పేజీ తరువాయి)

సంక్షేమ పథకాలు ఇస్తూనే కొత్త పథకాలు అందిస్తున్నాం" అనిఅన్నారు. నాట్లకు ముందే రైతు భరోసా నిధులు ప్రభుత్వం జమ చేయనున్నామని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. పైలెట్ ప్రాజెక్టు నుంచి వచ్చిన అనుభవాలను దృష్టిలో ఉంచుకొని తమ శక్తి మేరకు వేగవంతంగా సర్వే చేస్తామని తెలిపారు. గ్రామాల్లో ఉన్న తక్కువ విస్తీర్ణం భూమికి కూడా కొన్ని చోట్ల పట్టాల్లో వేల ఎకరాలు ఉన్నట్టు ఉందని, దీని వల్ల ప్రభుత్వంపై భారం పడుతోందన్నారు. భూముల రికార్డులు సక్రమం గా నిర్వహించేందుకు రైతులు, భూ యజ మానుల నుంచి టోకెన్ అమౌంట్ సేకరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో భూ పరిపాలన ప్రధాన కమిషనర్ సీసీఎల్ నవీన్ మిట్టల్, కలెక్టర్ ముజ్మిల్ ఖాన్, జేడీఎల్ ప్రసన్నలక్ష్మి, వైరా ఎమ్మెల్యే రాందాసు నాయక్, మధిర మార్కెట్ కమిటీ చైర్మెన్ బండారు నరసింహారావు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డి తదిరతరులు పాల్గొన్నారు.

# భారత్‌లో కంపెనీలు పెట్టండి

(మొదటి పేజీ తరువాయి)

కలలు సాకారం అవుతాయి అనడానికి కేసీఆర్ గారి జీవితమే సాక్ష్యమన్నారు. రాజకీయాల్లో చిన్న వయసుగా పరిగణించే నాలుగు పదుల వయసులో పదవులను త్యాగం చేసి తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం ఉద్యమం మొదలుపెట్టిన రోజు అనేకమంది ఆయనను అవహేళన చేశారని చెప్పారు. కానీ 14 సంవత్సరాల నిరంతర పోరాటం తర్వాత ప్రత్యేక రాష్ట్రం సాధించుకున్నప్పుడు సమాజంలోని ప్రతి ఒక్కరు కేసీఆర్ గారిపై ప్రశంసలు కురిపించారన్నారు.

పలువురు విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు కేటీఆర్ సమాధానం చెప్పారు. అమెరికాలో చదువుకుని ఇండియాకి తిరిగి వచ్చి కంపెనీలు ప్రారంభించాలని విద్యార్థులను కోరారు. మనదేశంలో ఎన్నో సవాళ్లు ఉన్నప్పటికీ అనేక అవకాశాలు కూడా ఉన్న విషయాన్ని గుర్తించుకోవాలన్నారు. మేథోవలస మన దేశానికి పెను సవాలుగా మారిందని చెప్పారు. దేశాభివృద్ధిలో, తెలంగాణ అభివృద్ధిలో విదేశాల్లో చదువుకుంటున్న యువత భాగం కావాలని పిలుపునిచ్చారు.

# రాబోయేది బీఆర్ఎస్ ప్రభుత్వమే...

**-చల్మెడ లక్ష్మీనరసింహారావు**

**బలగం టీవీ, వేములవాడ:**



రాబోయే కాలంలో బిఆర్ఎస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని,వేములవాడ నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జ చల్మెడ లక్ష్మీనరసింహారావు అన్నారు. వేములవాడ మున్సిపల్ పరిధిలోని బీఆర్ఎస్ నాయకుల తో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చల్మెడ లక్ష్మీనరసింహారావు మాట్లాడుతూ ప్రతి వార్డునుండి నాయకులందరూ బిఆర్ఎస్ సైనికులుగా మారి రాబోయే ఎన్నికల్లో వారి సత్తా చూపించాలన్నారు. గడిచిన బిఆర్ఎస్ ప్రభుత్వం కాలంలో చేసిన పనులను ప్రజలకు అర్థమయ్యేలా వివరించాలని అన్నారు. మన మొదటి కర్తవ్యం పార్టీ బలోపేతానికి కృషి చేయాలని, సీనియర్ నాయకుల సలహాలు పార్టీకి అవసరమన్నారు. త్వరలోనే బూత్ స్థాయి, పట్టణ కమిటీలను వేసుకుందామన్నారు. పార్టీ నుండి వెళ్లినవారు కూడా సంతోషంగా లేరని, మళ్లీ బిఆర్ఎస్ ప్రభుత్వం వచ్చేలా ఉందని అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బిఆర్ఎస్ బలాన్ని చూపించి మున్సిపల్ పై బిఆర్ఎస్ జండా ఎగర వెయ్యాలని అన్నారు. బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు ఏనుగు మనోహర్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ రామతీర్థపు మాధవి రాజు, ప్రధాన కార్యదర్శి క్రాంతికుమార్, సీనియర్ నాయకులు పోలాస నరేందర్, నరాల దేవేందర్, మాజీ కౌన్సిలర్లు నిమ్మశెట్టి విజయ్, మారం కుమార్, జోగిని శంకర్, సిరిగిరి చందు, నరాల శేఖర్, గోలి మహేష్, నాయకులు నీలం శేఖర్, కొండ కనుకయ్య, కొండ నర్సయ్య, వెంగళ శ్రీకాంత్ గౌడ్, అంజద్ పాషా, చేపూరి రవీందర్, భాస్కర్ రావు, వెంకట్ రెడ్డి, వాసాల శ్రీనివాస్, గుడిసె సదానందం, ముద్రకోల వెంకటేశం, మల్లేశం, సుంకపాక రాజు, జడల చిన్న శ్రీనివాస్, వార్డు అధ్యక్షులు, నాయకులు తదితరులు

## రెండు రోజులు పాటు వర్ష సూచన

**బలగం టీవి, హైదరాబాద్**

రాష్ట్రంలో రెండు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం సూచించింది. రాబోయే రెండు రోజులు గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీస్తాయని పేర్కొంది. ఈ మేరకు రాష్ట్రంలోని ఆదిలాబాద్, కొమురభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, సిద్ధిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల్, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, వరంగల్, హన్మకొండ, జనగాం, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్ జిల్లాల్లో అక్కడక్కడ వర్షాలు కురుస్తాయని, ఈ జిల్లాలకు ఎల్లో హెచ్చరికలు జారీ చేసింది.

## దేశంలో 4026 కరోనా కేసులు

**బలగం టీవి, హైదరాబాద్**

దేశంలోనూ కరోనా కేసులు విపరీతంగా పెరిగిపోతున్నాయి. అలాగే మరణాలు కూడా అదే స్థాయిలో సంభవిస్తున్నాయి. మంగళవారం నాటికి దేశంలో కొవిడ్-19 కేసుల సంఖ్య 4 వేల మార్కును దాటగా.. గడిచిన 24 గంటల్లోనే ఐదుగురు ప్రాణాలు కోల్పోయారు. కేరళ ఎక్కువ కేసులతో అగ్ర స్థానంలో నిలిచింది. అయితే ఢిల్లీలోనూ గణనీయంగా కేసులు పెరిగినట్లు కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ తెలిపింది. మంగళవారం రోజు కరోనా కేసుల సంక్య 4026కు చేరుకున్నట్లు కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ తాజాగా ప్రకటించింది. అలాగే గడిచిన 24 గంటల్లోనే ఐదుగురు కరోనా బారిన పడి ప్రాణాలు కోల్పోయినట్లు స్పష్టం చేసింది. కేరళ ఇప్పటికీ.. ఎక్కువ కేసులతో అగ్ర స్థానంలోనే ఉన్నట్లు స్పష్టం చేసింది. సోమవారం రోజు నుంచి 171 కొత్త కేసులు నమోదు కాగా.. రాష్ట్రంలో యాక్టివ్ కేసుల సంఖ్య 1416కి చేరుకున్నట్లు తెలిపింది. అంతేకాకుండా దేశ రాజధాని ఢిల్లీలోనూ కేసుల సంఖ్య గణనీయంగా పెరిగినట్లు పేర్కొంది. 124 కొత్త ఇన్ఫెక్షన్లు నమోదు కాగా.. యాక్టివ్ కేసుల సంఖ్య 393కు చేరుకుందని వెల్లడించింది. మహారాష్ట్రలో కొత్తగా 69 మందికి కరోనా సోకగా.. దీంతో ఆ రాష్ట్రంలో యాక్టివ్ కేసుల సంఖ్య 494కి పెరిగింది. అలాగే పశ్చిమ బెంగాల్‌లో 11 కొత్త కేసులు నమోదు అయ్యాయని.. దీంతో యాక్టివ్ కేసుల సంఖ్య 372కు చేరుకుందని కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. అలాగే దక్షిణ మరియు పశ్చిమ భారతదేశం నుంచి సేకరించిన నమూనాల ప్రకారం.. వీటికి ఓమిక్రాన్ ఉప వేరియంట్లే కారణం అని ఐసీఎంఆర్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ రాజీవ్ బహల్ తెలిపారు. అయితే ప్రస్తుతం ఈ కేసుల గురించి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని రాజీవ్ బహల్ తెలిపారు. కాకపోతే ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గర్భిణీలు, ఇతర అనారోగ్య సమస్యలు ఉన్నవారు, వృద్ధులు మాస్కులు ధరించాలని చెప్పారు. ఈ వేరియంట్ల అతి త్వరగా వ్యాపించినా స్వల్ప లక్షణాలు మాత్రమే కనిపిస్తున్నాయన్నారు.

## తుర్కియే తీరంలో 5.8 తీవ్రతతో భూకంపం

**ఒకరు మృతి**

**బలగం టీవి, హైదరాబాద్**

తుర్కియే తీర పట్టణాన్ని 5.8 తీవ్రతతో కూడిన భూకంపం మంగళవారం కుదిపేసింది. దాంతో ప్రజల్లో భయాందోళన నెలకొందని అధికారులు తెలిపారు. చాలా మంది కిటికీల నుంచి లేక బాల్కనీల నుంచి దూకి ప్రాణాలను కాపుడుకునే ప్రయత్నంలో గాయపడ్డారు. కాగా ఓ 14 ఏళ్ల బాలికను హాస్పిటల్‌కు తీసుకుపోగా అక్కడ చనిపోయింది. దీనికి మించి పెద్ద నష్టం జరిగిన సమాచారం ఏమి లేదు. మధ్యదరా సముద్రంలో రాత్రి 2.17 గంటలకు ఈ భూకంపం వచ్చిందని వార్త. గ్రీకు ద్వీపం రోడ్స్‌లో కూడా దీని ప్రభావం కనిపించింది. తుర్కియేలో 2023లో 7.8 తీవ్రతతో కూడిన భూకంపం రాగా నాడు 53వేల మంది చనిపోయారన్నది గమనార్హం. ఇదిలావుండగా పాకిస్థాన్‌లో కూడా భూకంపం వార్తలు భయాందోళనలు రేకెత్తించగా కరాచీలోని మలిర్ జైలు నుంచి 200కు పైగా ఖైదీలు తప్పించుకుని పారిపోయారు. అయితే పోలీసులు వారిని తిరిగి పట్టుకుని కారాగారం గదుల్లోకి తీసుకొచ్చారు. ఈ విషయాన్ని సింధ్ హోంమంత్రి జియావుల్ హసన్ లంర్ఘర్ మంగళవారం ధ్రువీకరించారు. మలిర్ జైలులో 100కు పైగా భారతీయ ఖైదీలు కూడా ఉన్నారన్నది గమనార్హం. వారిలో ఎక్కువ వరకు చేపలు పట్టేవారే.

## మిస్ వరల్డ్ పోటీల ఖర్చు రూ.30 కోట్లే

(మొదటి పేజీ తరువాయి)

విమర్శలు చేస్తున్నాయని మండిపడ్డారు. ఈ పోటీలపై కొందరు తప్పుడు ప్రచారం చేశారని, గొప్పగా కార్యక్రమం నిర్వహిస్తే పలుచన చేయాలని చూశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. విపక్షాల విమర్శలు చూసి నవ్వాలో ఏడవాలో అర్థం కావడం లేదన్నారు.మిస్ వరల్ పోటీలకు రూ.200 కోట్లు ఖర్చు ఎక్కడ అయ్యాయో చెప్పాలని మాజీ మంత్రులు కేటీఆర్, హరీష్ రావుకు సవాల్ విసిరారు. తెలంగాణ భవన్ కు రావాలా? అబిడ్స్ చౌరస్తాకు రావాలా? రూ.200 కోట్లు ఖర్చు అయినట్లు నిరూపించకుంటే ముక్కు నేలకు రాయాలని మంత్రి డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ పాలనలో టూరిజం ప్రమోషన్లకే రూ.115 కోట్లకు పైగా ఖర్చు చేశారని తెలిపారు. ఇంత పెద్ద ఈవెంట్ ను తక్కు ఖర్చుతో ఘనంగా నిర్వహించామని పేర్కొన్నారు. సొంత పత్రికలు, మీడియా, సోషల్ మీడియాలో అసత్యాలు ప్రచారం చేశారని, అందగత్తెల కాళ్లు కడిగారని విష ప్రచారం చేశారని మండిపడ్డారు. ఐఏఎస్ అధికారులతో కాళ్లు మొక్కించుకున్నఘనత కేసీఆర్‌దేనని అన్నారు. కంటెస్టెంట్లకు 30 తులాల బంగారం ఇచ్చారనేది పచ్చి అబద్ధం' అని ఖండించారు. 30 తులాలు కాదు, మూడు గ్రాములు కూడా ఇవ్వలేదని తెలిపారు. చౌమహల్లా ప్యాలెస్ విందులో ఒక్కో ప్లేట్ భోజనానికి లక్ష రూపాయాలు ఖర్చు చేశారనేదీ అవాస్తమని, ఒక్కో ప్లేట్ కు అయిన ఖర్చు రూ.8,200 మాత్రమేనని స్పష్టం చేశారు.

తనపట్ల తప్పుగా ప్రవర్తించారని మిస్ ఇంగ్లాండ్ మిల్లా మ్యాగీ చేసిన ఆరోపణలను మంత్రి జూపల్లి ఖండించారు. ఆమె ఆరోపణల్లో వాస్తవం లేదని పేర్కొన్నారు. దీనిపై కొందరు బీఆర్ఎస్ నాయకులు కావాలనే దుష్ప్రచారం చేస్తున్నారని, అవన్నీ అభూతక కల్పనలేనని తోసిపుచ్చారు. మిస్ ఇంగ్లాండ్ ను ఇబ్బంది పెట్టారనేది వాస్తవం అయితే మిగతా 108 మంది పోటీదారులు చివరి వరకు ఉండేవారు కాదన్నారు. మిస్ వరల్డ్ పోటీదారులుగా వచ్చిన వారు చివరిదాకా చాలా హ్యాపీగా ఉన్నారని చెప్పారు. ఏమీ జరగని దానికి ఏదో జరిగినట్టు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. వాళ్లను ఇబ్బంది పెడితే, మళ్లీ మళ్లీ తెలంగాణకు రావాలని ఉందని ఎందుకు చెబుతారని ప్రశ్నించారు

# ఎవరికీ ఒక రూపాయి ఇవ్వద్దు..

**-ఇందిరమ్మ ఇండ్లను లబ్దిదారుల వేగవంతంగా నిర్మించుకోవాలి..**

**కలెక్టర్ సందీప్ కుమార్ ఝ**

**బలగం టీవీ, సిరిసిల్ల**



ప్రభుత్వం అందించే సహాయం గురించి ఏ అధికారి లేదా దళారి నుంచి పైరవి చేయాల్సిన అవసరం లేదని, ఇంటి నిర్మాణం పురోగతి ప్రకారం పారదర్శకంగా ప్రభుత్వం నిధులు విడుదల చేస్తుందని, ఎవరికి ఒక రూపాయి ఇవ్వడానికి వీలు లేదని కలెక్టర్ సందీప్ కుమార్ ఝ అన్నారు. ఇల్లంతకుంట మండలం లోని శ్రీమాతా అన్నపూర్ణేశ్వరి ఫంక్షన్ హాల్ లో రెండో విడత క్రింద 760 ఇందిరమ్మ ఇండ్ల మంజూరి ఉత్తర్వులు మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ తో కలిసి కలెక్టర్ సందీప్ కుమార్ ఝ పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా లిజిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ మాట్లాడుతూ,లి ఇల్లంతకుంట మండలంలో మొదటి విడతలో 45 ఇండ్లు, రెండో విడత కింద 760 ఇండ్లను పూర్తి పారదర్శకంగా అర్హులను ఎంపిక చేసి నేడు ఉత్తర్వులు పంపిణీ చేస్తున్నామని కలెక్టర్ తెలిపారు. ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారులకు 4 దశలలో 5 లక్షల రూపాయల ఆర్థిక సహాయం అందుతుందని అన్నారు. బేస్మెంట్ నిర్మాణం పూర్తైన తర్వాత లక్ష రూపాయల, గోడలు నిర్మిస్తే 1లక్ష రూపాయలు, స్లాబ్ నిర్మించిన తర్వాత 2 లక్షల రూపాయలు, ఇంటి నిర్మాణం పూర్తయిన తర్వాత మరో లక్ష రూపాయలు నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలో జమ అవుతాయని కలెక్టర్ తెలిపారు.

ఇందిరమ్మ ఇంటి నిర్మాణంలో పూర్తి సహకారం ప్రభుత్వం నుంచి అందిస్తామని , నిర్మాణానికి అవసరమైన ఇసుక మండల కేంద్రాలలో అందుబాటులో పెడతామని తెలిపారు. మండలంలో ఉన్న 34 గ్రామాలకు ఇసుక రీచ్ లను అలాట్ చేశామని, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి ఉచితంగా ఇసుక సరఫరా చేస్తామని అన్నారు. 30 రోజుల లోగా ఇంటి నిర్మాణ పనులను లబ్ధిదారులు ప్రారంభించాలని లేని పక్షంలో మంజూరు చేసిన ఇండ్లు రద్దు అయ్యే అవకాశం ఉంటుందని, నిరుపేదలకు పెట్టుబడి లేని పక్షంలో స్వయం సహాయక మహిళా సంఘాల ద్వారా లక్ష రూపాయల రుణం అందిస్తామని అన్నారు.

ఇందిరమ్మ ఇండ్లను లబ్ధిదారులు వేగంగా నిర్మించుకుంటే మరొకరికి అవకాశం త్వరగా లభిస్తుందని,ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సరిగ్గా వాడుకొని లబ్ధిదారులు నాణ్యమైన ఇంటిని త్వోరగ నిర్మించుకోవాలని, సొంత స్థలంలో మంచి ఇండ్లు నిర్మించుకొని ప్రజల సంతోషంగా ఉండాలని అన్నారు.

మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ పేదలకు ఇచ్చిన మాట ప్రకారం సోంత స్థలం ఉన్న నిరు పేదలను గుర్తించి ఇల్లంతకుంట మండలంలో 805 ఇందిరమ్మ ఇండ్ల మంజూరు చేయడం సంతోషంగా ఉందని అన్నారు. తల్లి పేరు మీద ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించి ఇంట్లో ఉన్న మహిళ లబ్ధిదారు పేరు మీద నేడు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు అవుతున్నాయని అన్నారు. గత ప్రభుత్వం నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లకు కూడా త్రాగునీటి సరఫరా, విద్యుత్ సరఫరా, రోడ్లు వంటి మౌలిక సదుపాయాలను ప్రజా ప్రభుత్వం కల్పిస్తుందని, త్వరలోనే ఆ పనులు పూర్తి చేసి లబ్ధిదారులను ఎంపిక చేసి పారదర్శకంగా ఆ ఇండ్లను కూడా అందిస్తామని అన్నారు. ఆర్థికంగా రాష్ట్రం ఇబ్బందులు పడుతున్నప్పటికీ ప్రజలకు ఇచ్చిన మాట మేరకు ఒక్కొక్క హామీ అమలు చేస్తున్నామని అన్నారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన 48 గంటల వ్యవధిలో రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితి 10 లక్షలకు పెంపు, మహిళలకు ఆర్టిసి బస్సులో ఉచిత బస్సు ప్రయాణం పథకాలను ప్రారంభించామని అన్నారు. మహిళలకు నెలకు సరాసరి 3000 రూపాయలు ఉచిత బస్సు కింద అదా అవుతుందని అన్నారు.

గత పాలకులు ఎప్పుడైనా పంట నష్ట పరిహారం ఇచ్చిందో రైతులు గుర్తు చేసుకోవాలని, ప్రజా ప్రభుత్వం అకాల వర్షాలు వల్ల నష్టపోయిన రైతులకు ఎకరానికి 10 వేల రూపాయలు అందించారని అన్నారు. ప్రభుత్వం ముందుగా భూమి ఉన్న నిరుపేదలకు పెట్టుబడి 5 లక్షల రూపాయలు అందించి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసిందని, రెండవ విడతలో భూమి లేని పేదలకు ఎంపిక చేసి ఇంటి పట్టాలు అందించి ఇండ్లు నిర్మిస్తామని అన్నారు.

ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి అవసరమైన ఇసుక ఉచితంగా అందించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుందని అన్నారు. మహిళా సంఘాల ద్వారా పేదలకు పెట్టుబడి సహాయం క్రింద ముందు లక్ష రూపాయల రుణం కూడా అందిస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో పిడి హౌసింగ్ శంకర్, మండల ప్రత్యేక అధికారి డిసిఓ రామకృష్ణ, ఎంపీడీవో, తాసిల్దార్ సంబంధిత అధికారులు,ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# రాజన్న కోడెల సంరక్షణకు పకడ్బందీ చర్యలు



**బలగం టీవీ, వేములవాడ**

వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయానికి సంబంధించిన తిప్పాపూర్ లోని గోశాలలోఅకాల వర్షాలు, అనారోగ్య కారణాలు, పరిమితికి మించి ఉండడంతో పలు కోడెలు మృతి చెందగా, కలెక్టర్ సందీప్ కుమార్ ఝా వెంటనే స్పందించారు. వేములవాడ తిప్పాపూర్ లోని గోశాలను ఆకస్మికంగా ఇప్పటికే పలుమార్లు తనిఖీ చేశారు. వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి కోడెల సంరక్షణకు పకడ్బందీగా అన్ని చర్యలు కలెక్టర్ తీసుకుంటున్నారు.పక్కా ప్రణాళిక ప్రకారం అన్ని పనులు చేయిస్తున్నారు. గోశాల ఆవరణలో గుంతలు పడిన చోట, బురద, మిగతా స్థలాల్లో మొరం పోయించి, చదును చేయించారు. పారిశుధ్య పనులు చేయించి, పనులను స్వయంగా పరిశీలించి గోశాల ఆవరణను శుభ్రం చేయించారు. కోడెలకు మెరుగైన దాణా, పచ్చి గడ్డి అందించేలా ప్రణాళికలు సిద్ధం చేసి, త్వరగా అందేలా ఏర్పాట్లు చేశారు. 5 వెటర్నరీ వైద్యుల బృందం గోశాలలో ఉండి సేవలు అందిస్తున్నారు. పచ్చి గడ్డి సరఫరా కాంట్రాక్టర్ తో చర్చలు జరిపి రోజు సరఫరా చేసే ఒక ట్రాక్టర్ గడ్డికి బదులు, రోజు 10 టన్నుల (5 ట్రాక్టర్) గడ్డి వచ్చేలా ఏర్పాట్లు చేశారు.

## వర్షాకాలం వ్యాధుల వల్లే రాజన్న కోడెలు మృతి..

**-ప్రభుత్వ విప్ అది శ్రీనివాస్**

**బలగం టీవీ, సిరిసిల్ల**



వర్షాకాలం వ్యాధుల వల్లే రాజన్న కోడెలు చనిపోవడం బాధాకరమని ప్రభుత్వ విప్ అది శ్రీనివాస్ అన్నారు.మంగళవారం హైదరాబాద్ లోని సీఎల్పీ మీడియా పాయింట్‌లో ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ రాజన్న ఆలయంలో కోడెల మృతిపై సమీక్ష చేశామని అన్నారు.కొందరు భక్తులు పాలు కూడా మరువని కోడెలను తీసుకువస్తున్నారని అన్నారు. ఇలాంటి సంఘటనలు మళ్లీ పునరావృతం కాకుండా జాగ్రత్తలు తీసుకుంటామని అన్నారు.వేములవాడ రాజన్న ఆలయాన్ని విస్తరణ చేస్తున్నామని వెపాత ఆలయం, పాత మండపాలు యధావిధిగా ఉంటాయని అన్నారు.

బీఆర్ఎస్ బీజేపీలో విలీనం అవుతుందని ఎమ్మెల్సీ కవిత లేఖలో పేర్కొందని,పొత్తు పెట్టుకోకుండా ఉండటానికి బీఆర్ఎస్ ఉండాలి కదా అని అన్నారు. బీఆర్ఎస్ కేడర్‌ను మభ్య పెట్టేందుకే మాజీ మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతున్నారని అన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ నేతలు కలిసి కాంగ్రెస్‌ని దొంగదెబ్బ తీయాలని చూస్తున్నారని ఆరోపించారు. కవిత చెప్పిన దెయ్యాలు ఎవరో హరీశ్‌రావు సమాధానం చెప్పాలని అన్నారు. పార్టీ ఇంటర్నల్ విషయాలు బయటకి చెప్పిన కవితపై ఏమి చర్యలు తీసుకుంటారో చెప్పాలని డిమాండ్ చేశారు. మాజీ సీఎం కేసీఆర్‌కి అధికారం లేకపోతే తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం కూడా చేయరా అని ప్రశ్నించారు.

## క్రిటికల్ గా ఉన్న 6 కోడెలు మృతి..

**-అకాల వర్షాలు, అనారోగ్య పరిస్థితుల కారణంగా మొత్తం 26 కోడెలు మృతి**

**-జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి రవీందర్ రెడ్డి**

**బలగం టీవీ,సిరిసిల్ల**

తిప్పాపూర్ లోనే గోశాలలో క్రిటికల్ గా ఉన్న 6 పశువులు మంగళవారం మరణించాయని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి రవీందర్ రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.అకాల వర్షాలు అనారోగ్య పరిస్థితుల కారణంగా తిప్పాపూర్ లోని గోశాలలో మొదటి రోజు 8 కోడెలు రెండవ రోజు మరో 5 కోడెలు ,మూడవ రోజు 4 కోడెలు , సోమవారం మరో 3 పశువులు, మంగళవారం 6 పశువులు మరణించడం జరిగిందని, మొత్తం గోశాలలో ఇప్పటి వరకు 26 పశువులు చనిపోయాయని అన్నారు. గోశాలలో ఉన్న 1300 పశువులలో నేడు మరో 4 పశువులు అనారోగ్యం పాలయ్యాయని, ప్రస్తుతం మొత్తం 14 పశువులు అనారోగ్యంతో బాధపడుతున్నాయని, వీటికి వెటర్నరీ డాక్టర్లు వైద్యం అందిస్తున్నట్లు తెలిపారు.

ఉమ్మడి కరీంనగర్ నుంచి నిపుణుల వైద్య బృందం తిప్పాపూర్ లోని గోశాలను పరిశీలించి కోడెలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నారని పేర్కొన్నారు. చిన్న వయసు గల పశువులు, పెద్ద వయసు గల పశువులు ఒకేచోట ఉండటం వల్ల మరణాలు సంభవిస్తున్నట్లు నిపుణులు తెలిపారని అన్నారు. వేములవాడ రాజన్న ఆలయ భక్తులు దేవాలయానికి కోడెలు సమర్పించే సమయంలో తప్పనిసరిగా 1.1/2 సంవత్సరం కంటే ఎక్కువ వయసున్న కోడెలు మాత్రమే సమర్పించాలని ఆయన సూచించారు. కోడెల ఆరోగ్య సంరక్షణకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.

## రాజన్నను దర్శించుకున్న దేవాదాయ శాఖ కమిషనర్

**బలగం టీవీ, వేములవాడ**



వేములవాడలోని శ్రీ రాజరాజేశ్వర స్వామి వారిని మంగళవారం దేవాదాయ శాఖ కమీషనర్ వెంకట్ రావు కుటుంబ సమేతంగా దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించి కోడె మొక్కుచెల్లించుకున్నారు. ఆలయ సాంప్రదాయం ప్రకారం పూర్ణ కుంభంతో ఆలయ అర్చకులు స్వాగతం పలికారు. స్వామి వారి కళ్యాణమండపములో ఆలయ అర్చకులు కమిషనర్ దంపతులకు వేదోక్త ఆశీర్వాదం అందించగా, అనంతరం ఈ వో వినోద్ శేష వస్త్రం కప్పి లడ్డు ప్రసాదం అందజేశారు.వారి వెంట ఆలయ సిబ్బంది ఉన్నారు

## ప్రతి భూమికి భూధార్ వ్యవస్థ..

**-కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**

**బలగం టివి, సిరిసిల్ల**



భూ హక్కుల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన భూభారతి చట్టం వినియోగించుకొని జూన్ 3 నుంచి జూన్ 20 వరకు ప్రతి మండలంలో రెవెన్యూ సదస్సులు నిర్వహించడం జరుగుతుందని కలెక్టర్ సందీప్ కుమార్ ఝ అన్నారు.మంగళవారం ఇల్లంతకుంట మండలం లో ముస్కానీపేట్ గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో ఏర్పాటుచేసిన రెవెన్యూ భూ సదస్సు లో కలెక్టర్ సందీప్ కుమార్ ఝ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ మాట్లాడుతూ రెవెన్యూ సదస్సుల ద్వారా ప్రజల వద్దకు వెళ్లి భూ సమస్యలపై దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని అన్నారు. మనిషికి ఆధార్ కార్డు ఉన్నట్లు భూమికి భూ దార్ నెంబర్ భూమికి సంబంధించిన అన్ని వివరాలతో అందించడం జరుగుతుందని అన్నారు. రాష్ట్రంలో ఇక నుంచి భూముల క్రయ విక్రయాలకు తప్పనిసరిగా మ్యాప్ జత చేయాలని, దీని కోసం తెలంగాణ రాష్ట్రంలో నూతనంగా 7 వేల లైసెన్సెడ్ ప్రైవేటు సర్వేయర్లకు శిక్షణ కార్యక్రమం ప్రారంభించామని అన్నారు. సాదా బైనమా దరఖాస్తులకు శాశ్వత పరిష్కారం చూపేందుకు ప్రస్తుతం భూమి ఎవరి కబ్జాలో ఉంటే పంచనామా నిర్వహించి స్థానికంగా విచారణ చేసి వారికి పట్టాలు అందించేందుకు చర్యలు చేపట్టి భూ సమస్యలు పరిష్కరిస్తామని అన్నారు. భూముల మ్యూటేషన్ సమయంలో కుటుంబ సభ్యులందరికీ తప్పనిసరిగా నోటీసులు జారీ చేయాలని, 30 రోజుల లోపు ఈ ప్రక్రియ పూర్తి చేసేలా చట్టంలో మార్పులు తీసుకొని వచ్చామని అన్నారు. భూ యాజమాన్య వివాదాలను గతంలో సివిల్ కోర్టులో మాత్రమే పరిష్కారం ఉండేదని, ప్రభుత్వం తహసిల్దార్ నుంచి సిసిఎల్ఏ వరకు రెవెన్యూ కోర్టులను మళ్లీ ప్రవేశ పెట్టిందని అన్నారు. సిరిసిల్ల ఆర్డీఓ వెంకటేశ్వర్లు ఇల్లంతకుంట తహసిల్దార్ ఫారూఖ్ , సంబంధిత అధికారులు, రైతులు ,తదితరులు పాల్గొన్నారు.

## ఇల్లు లేని నిరుపేదలకు వెంటనే న్యాయం చేయాలి..

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**




ఇళ్లు లేని నిరుపేదలకు గత ప్రభుత్వం చేసిన అన్యాయాన్ని సరిదిద్ది, వెంటనే ఇంటి స్థలాలు కేటాయించి, నిర్మాణానికి ఐదు లక్షల రూపాయలు అందించాలని, లేదంటే డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను కేటాయించి న్యాయం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ము. శం. రమేష్ డిమాండ్ చేశారు. శాంతినగర్‌లో నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను తక్షణమే పంపిణీ చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. అమృత్‌లాల్ శుక్లా కార్మిక భవనంలో జరిగిన విలేకరుల సమావేశంలో రమేష్ మాట్లాడుతూ, సిరిసిల్ల పట్టణంలో వెయ్యి మందికి పైగా నిరుపేదలు అద్దె ఇళ్లలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత సొంత ఇళ్లు వస్తాయని ఆశపడ్డ పేదల ఆశలను గత పదేళ్ల టీఆర్ఎస్ ప్రభుత్వం నిరాశపరిచిందని ఆయన మండిపడ్డారు. ఎన్నో సర్వేలు నిర్వహించి, అర్హులను గుర్తించి, పేర్లను ప్రకటించినప్పటికీ, చివరికి డ్రా ద్వారా ఎంపిక చేయడం వలన డ్రాలో రానివారికి తీవ్ర అన్యాయం జరిగిందని రమేష్ అన్నారు. సొంతింటి కల కలగానే మిగిలిపోయిందని, అద్దె ఇంట్లో ఎవరైనా చనిపోతే శవాన్ని రోడ్డు మీద వేసుకొని ఉండవలసిన పరిస్థితి సిరిసిల్లలో కనబడుతోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

# ఈ సాలా కప్ ఆర్సీబీదే

- ఫైనల్‌లో పంజాబ్ సూపర్ కింగ్స్‌పై గెలుపు
- 18 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత ఆర్సీబీ తొలి ఐపీఎల్ టైటిల్ కైవసం
- మరో సారి పంజాబ్‌క నిరాశే




**బలగం టీవి, హైదరాబాద్**

రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ) జట్టు ఈ సాల కప్ నమదే (ఈ ఏడాది కప్ మనదే) అంటూతొలిసారి ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) ట్రోఫీని కైవసం చేసుకుంది. ... 18 ఏళ్ల సుదీర్ఘ నిరీక్షణ తర్వాత ఆర్సీబీ ఐపీఎల్ కప్‌ను ముద్దాడింది. అహ్మదాబాద్‌లో ఉత్కంఠభరితంగా జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో పంజాబ్ సూపర్ కింగ్స్‌పై 6 పరుగుల తేడాతో అద్భుత విజయం సాధించింది. విరాట్ కోహ్లీ ఎట్టకేలకు తన తొలి ఐపీఎల్ టైటిల్‌ను అందుకున్నాడు. ఈ విజయంతో కోహ్లీ కన్నీటి పర్యంతమయ్యాడు.

మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన ఆర్సీబీ నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్లకు 190 పరుగులు చేసింది. విరాట్ కోహ్లీ(35 బంతుల్లో 3 ఫోర్లతో 43) టాప్ స్కోరర్‌గా నిలవగా.. మయాంక్ అగర్వాల్(24), రజత్ పటీదార్(26), లివింగ్ స్టోన్(25), జితేష్ శర్మ(24) పర్వాలేదనిపించారు. పంజాబ్ బౌలర్లలో అర్ష్‌దీప్ సింగ్(3/40), కైల్ జెమీసన్(3/48) మూడేసి వికెట్లు తీయగా.. అజ్మతుల్లా ఒమర్జాయ్, విజయ్ కుమార్ వైశాఖ్, యుజ్వేంద్ర చాహల్ తలో వికెట్ తీసారు.

అనంతరం 20 ఓవర్లలో పంజాబ్ 7 వికెట్లకు 184 పరుగులే చేసి ఓటమిపాలైంది. పంజాబ్ కింగ్స్ ఓపెనర్లు ప్రియాన్ష్ ఆర్య(24), ప్రభ్‌సిమ్రాన్ సింగ్(26) శుభారంభం అందించారు. ఆ తర్వాత వచ్చిన జోష్ ఇంగ్లీస్ దూకుడుగా ఆడాడు. దూకుడుగా ఆడుతున్న ప్రభ్‌సిమ్రాన్ సింగ్‌ను కృనాల్ పాండ్యా పెవిలియన్ చేర్చాడు. క్రీజులోకి వచ్చిన శ్రేయస్ అయ్యర్(1)ను రొమారియో షెపర్డ్ క్యాచ్ ఔట్‌గా పెవిలియన్ చేర్చి మ్యాచ్‌ను మలుపు తిప్పాడు. ఆ తర్వాత వచ్చిన నెహాల్ వధేరా జిడ్డుగా బ్యాటింగ్ చేయగా.. జోష్ ఇంగ్లీస్ దూకుడుగా ఆడే ప్రయత్నం చేశాడు. అతన్ని కృనాల్ పాండ్యా ఔట్ చేయగా.. నెహాల్ వధేరా(15)ను భువనేశ్వర్ కుమార్ పెవిలియన్ చేర్చాడు. క్రీజులోకి వచ్చిన మార్కస్ స్టోయినీస్ భారీ సిక్సర్ బాది మరుసటి బంతికి క్యాచ్ ఔటయ్యాడు. అజ్మతుల్లా ఒమర్జాయ్(1)ను యశ్ దయాల్ ఔట్ చేయడంతో మ్యాచ్ ఆర్సీబీ వైపు మళ్లింది. చివర్లో శశాంక్ సింగ్(29 బంతుల్లో 3 ఫోర్లు, 5 సిక్స్‌లతో 61 నాటౌట్) అజేయ హాఫ్ సెంచరీతో పోరాడినా ఫలితం లేకపోయింది. ఆర్సీబీ బౌలర్లలో భువనేశ్వర్ కుమార్(2/38), కృనాల్ పాండ్యా(2/17) రెండేసి వికెట్లు తీయగా.. జోష్ హజెల్ వుడ్, రొమారియో షెపర్డ్ తలో వికెట్ తీసారు.

### కోహ్లీకి ఆనందం...

ఆర్సీబీ తరపున ఆరంభం నుంచి ఆడుతున్న విరాట్ కోహ్లీకి ఈ విజయం ఎంతో ప్రత్యేకం. గతంలో మూడుసార్లు ఫైనల్ చేరినా, టైటిల్ గెలవలేకపోయిన ఆర్సీబీకి, కోహ్లీ నాయకత్వ పటిమ, అద్భుత ఆటతీరు ఈసారి ట్రోఫీని అందించడంలో కీలక పాత్ర పోషించాయి. మరోవైపు, పంజాబ్ కింగ్స్ కెప్టెన్ శ్రేయాస్ అయ్యర్‌కు ఇది మూడో ఐపీఎల్ ఫైనల్ అయినప్పటికీ, నిరాశే ఎదురైంది. రెండు జట్లు తమ తొలి టైటిల్ కోసం తీవ్రంగా పోరాడిన ఈ మ్యాచ్, చివరికి ఆర్సీబీకి చిరకాల స్వప్నాన్ని నెరవేర్చింది. కాగా, చివరి ఓవర్లో ఆర్సీబీ విజయం ఖరారు కాగానే, కోహ్లీ కన్నీటి పర్యంతం అయ్యాడు. ఎన్నో ఏళ్లుగా దక్కని విజయం, ఇన్నాళ్లకు దక్కిందన్న భావోద్వేగాలతో కోహ్లీ కంటతడి పెట్టాడు.

### బెంగళూరుకు మద్దతుగా బ్రిటన్ మాజీ ప్రధాని..


ఈ ఫైనల్ మ్యాచ్ కు బ్రిటన్ మాజీ ప్రధాని, బెంగళూరు అల్లుడు రిషి సునాక్ సతీసమేతంగా హాజరయ్యారు. స్టేడియంలో ఆయన ఆర్సీబీకి సపోర్ట్ చేస్తూ కనిపించారు. బెంగళూరు టీమ్ ను అడుగడుగునా ప్రోత్సహిస్తూ ఆయన మ్యాచ్ ను బాగా ఎంజాయ్ చేశారు. ఇలాంటి క్రికెట్ అనుభూతిని ఎప్పుడూ పొందలేదని రిషి సునాక్ వ్యాఖ్యానించారు.

### అదరగొట్టిన ఆటగాళ్లకు అవార్డులు

**ప్లేయర్ ఆఫ్ ది సిజన్ : సాయి సుదర్శన్**
759 పరుగులతో ఆరెంజ్ క్యాప్‌ను సొంతం
ఎమర్జింగ్ ప్లేయర్ : సాయి సుదర్శన్
**పర్పుల్ క్యాప్ విన్నర్ ప్రసిద్ధ్ కృష్ణ**
ప్రసిద్ధ్ కృష్ణ (25 వికెట్లు)

మోస్ట్ వాల్యుబల్ ప్లేయర్ : సూర్యకుమార్ యాదవ్
ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు విజేత కృనాల్ పాండ్య
ఐపీఎల్ ఫెయిర్ ప్లే అవార్డు విజేతగా చెన్నై సూపర్ కింగ్స్
ఫైనల్‌లో ఓటమితో రన్నరప్‌గా నిలిచిన పంజాబ్ కింగ్స్
షీల్డ్‌ను అందుకొన్న కెప్టెన్ శ్రేయస్ అయ్యర్

# అంచనాలు పెంచేసిన రాజాసాబ్




- డిసెంబర్ 5న విడుదల
- ఈ నెల 16న ఉదయం 10.52 గంటలకు టీజర్ రిలీజ్ మేకర్స్
- పోస్టర్‌తో ప్రకటించిన మేకర్స్

**బలగం టీవి, హైదరాబాద్**

ప్రభాస్ లీడ్ రోల్‌లో నటిస్తున్న రాజాసాబ్ సినిమా నుంచి సాలిడ్ అప్డేట్ వచ్చింది. ఈ సినిమా రిలీజ్ డేట్ అనౌన్స్‌మెంట్ చేస్తూ మేకర్స్ కీలక ప్రకటన చేశారు. అలాగే టీజర్ అప్డేట్ కూడా ఇచ్చేశారు. ఈ మేరకు సోషల్ మీడియాలో ఓ కొత్త పోస్టర్ రిలీజ్ చేస్తూ షేర్ చేశారు. ఈ పోస్టర్ సినిమా మీద అంచనాలను ఒక్కసారిగా పెంచేసింది.

2025 డిసెంబర్ 05న ఈ సినిమా వరల్డ్‌వైడ్ గ్రాండ్‌గా రిలీజ్ కానున్నట్లు మేకర్స్ ప్రకటించారు. మారుతి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని పిపుల్స్ మీడియా ఫ్యాక్టరీ నిర్మిస్తోంది. రాజా సాబ్ మూవీలో మాళవిక మోహనన్, నిధి అగర్వాల్ లు కథానాయికలుగా నటిస్తున్నారు. ఈ చిత్ర టీజర్ విడుదల తేదీని కూడా ప్రకటించారు. టీజర్‌ను జూన్ 16న ఉదయం 10 గంటల 52 నిమిషాలకు విడుదల చేయనున్నట్లు చిత్ర బృందం తెలిపింది. ఇక ఈ చిత్రంలో సంజయ్ దత్, మురళి శర్మ, అనుపమ్ ఖేర్, రిద్ధి కుమార్ లు కీలక పాత్రలను పోషిస్తున్నారు. హారర్ కామెడీ జోనర్‌లో ఈ చిత్రం రూపుదిద్దుకుండగా తమన్ సంగీతాన్ని అందిస్తున్నారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌పై టీజీ విశ్వప్రసాద్ ఈ మూవీని నిర్మిస్తున్నారు.




## ఆసక్తికరంగా రానా నాయుడు: సీజన్ 2' ట్రైలర్

**బలగం టీవి, హైదరాబాద్**

విక్టరీ వెంకటేశ్, రానా ప్రధాన పాత్రలలో రూపొందిన వెబ్ సిరీస్ రానా నాయుడు. మొదటి సీజన్ యువతను బాగా ఆకట్టుకోవడంతో ఇప్పుడు కొనసాగింపుగా 'రానా నాయుడు: సీజన్ 2' వస్తోంది. ఈ క్రమంలో రానా నాయుడు సీజన్ 2కి సంబంధించిన ట్రైలర్ తాజాగా విడుదలైంది. ఇందులో వినోదం, థ్రిల్లింగ్ అంశాలు అంచనాలని పెంచేశాయి. 'రానా నాయుడు: సీజన్ 2'లో నాగ నాయుడుగా వెంకటేశ్ సందడి చేయనున్నారు. 'రానా నాయుడు: సీజన్ 2' మొత్తం యాక్షన్, డ్రామాతో నిండి ఉంటుంది. ఇది జూన్ 13 నుంచి నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ కానుంది. తొలి పార్ట్‌లో కాస్త బోల్డ్ కంటెంట్ ఉందని విమర్శలు వచ్చిన నేపథ్యంలో సీక్వెల్‌లో కాస్త దానిని తగ్గించారు. తెలుగు, తమిళం, కన్నడ, మలయాళ భాషలలో ఇది విడుదల కానుంది. అర్జున్ రాంపాల్, సుర్వీన్ చావ్లా, కృతి కర్బంద, సుశాంత్ సింగ్, అభిషేక్ బెనర్జీ, డినోమోరియా తదతరులు ఇందులో కీలక పాత్రలు పోషించారు. కాగా, రియల్ లైఫ్ లో బాబాయి, అబ్బాయిలు ఈ వెబ్ సిరీస్ లో తండ్రి తనయులుగా నటించిన విషయం తెలిసిందే. ఈ క్రేజీ సిరీస్‌ని కరణ్ అన్షుమాన్, సుపర్ణ్ వర్మ, అభయ్ చోప్రా తెరకెక్కించగా... సుందర్ ఆరోన్, లోకోమోటివ్ గ్లోబల్ మీడియా నిర్మించింది.




## 6న 'బద్మాషులు'రిలీజ్

**బలగం టీవి, హైదరాబాద్**

శంకర్ చేగూరి దర్శకత్వంలో బి. బాలకృష్ణ, రమా శంకర్ నిర్మించిన చిత్రం 'బద్మాషులు'. మహేష్ చింతల, విద్యాసాగర్, బలగం సుధా కర్ రెడ్డి, మురళీధర్ గౌడ్, కవితా శ్రీరంగం, దీక్ష కోటేశ్వర్ కీలకపాత్రల్లో నటించారు. ఈ చిత్రం ఈనెల 6న రిలీజ్ అవుతున్న సందర్భంగా చిత్ర యూనిట్ ప్రీ రిలీజ్ ఈవెంట్ నిర్వహించింది. ఈ వేడుకలో దర్శకులు తరుణ్ భాస్కర్, మాలిక్ రామ్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. డైరెక్టర్ తరుణ్ భాస్కర్ మాట్లాడుతూ,'చాలామంది కామెడీని చాలా తేలిగ్గా తీసి పారేస్తుంటారు. కానీ ఆ కామెడీ సన్నివేశాలు వెనుక ఎంత కష్టం, నిజాయితీ దాగుందనేది చూసే వాళ్లకి అర్థం కాదు. ఆ సీన్లు రాసిన వాళ్లకే తెలుస్తుంది. ఈ చిత్రం మంచి విజయం సాధించాలి' అని అన్నారు. 'తరుణ్ భాస్కర్ ఈ ప్రీ రిలీజ్‌కి వచ్చి ఈ చిత్రాన్ని మరో స్థాయికి పెంచారు. ఈ మూవీ రెండు గంటల పాటు ఫన్ రైడ్‌గా సాగుతుంది. నవ్విస్తూనే ఒక మంచి మెసేజ్ కూడా అందించాం' అని చిత్ర డైరెక్టర్ శంకర్ చేకూరి చెప్పారు.




## చౌదరిగారి అబ్బాయితో నాయుడు గారి అమ్మాయి..

- టైటిల్ గ్లింప్స్ విడుదల

**బలగం టీవి, హైదరాబాద్**

'బిగ్‌బాస్'ఫేం అమరదీప్ చౌదరి, సుప్రీతా నాయుడు జంటగా రూపొందుతోన్న లవ్ ఎంటైర్టెనర్ 'చౌదరిగారి అబ్బాయితో నాయుడుగారి అమ్మాయి'. మాల్యాద్రిరెడ్డి దర్శకుడు. మహేంద్రనాథ్ కూండ్ల నిర్మాత. ఈ సినిమా టైటిల్ గ్లింప్స్‌ని హైదరాబాద్‌లో మేకర్స్ విడుదల చేశారు. హీరోహీరోయిన్లతోపాటు రాశి, వినోద్‌కమార్, సురేఖవాణి, రాజారవీంద్ర లాంటి పాపులర్ నటీనటులు తోడవ్వడంతో సినిమాపై క్రేజ్ పెరిగిందని, షూటింగ్ పూర్తయి పోస్ట్ ప్రొడక్షన్ దశలో ఉన్న ఈ సినిమాను త్వరలో విడుదల చేస్తామని నిర్మాత తెలిపారు. ఈ సినిమాలో నటించడం పట్ల హీరోహీరోయిన్లు ఆనందం వ్యక్తం చేశారు.

## చంద్రబాబుకు నాగార్జున ఆహ్వానం

**బలగం టీవి, హైదరాబాద్**



ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబుతో సినీ నటుడు అక్కినేని నాగార్జున ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఉండవల్లిలోని క్యాంపు కార్యాలయంలో ఏపీ సీఎంను నాగార్జున కలిశారు. తన కుమారుడు, యువ హీరో అక్కినేని అఖిల్ వివాహానికి హాజరు కావాల్సిందిగా ముఖ్యమంత్రిని ఆయన వ్యక్తిగతంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా వివాహ ఆహ్వాన పత్రికను చంద్రబాబుకు నాగార్జున అందజేశారు. అఖిల్ వివాహం ఈ నెల 6వ తేదీన జరగనున్న నేపథ్యంలో, నాగార్జున ప్రముఖులను స్వయంగా కలిసి వివాహ వేడుకకు ఆహ్వానిస్తున్నారు.